సాక్షి
కామారెడ్డి
గురువారం । 4 । ఏప్రిల్ । 2024



రోడ్లపై వడ్లు..
రైతులు పంట నూర్పిడి చేసిన తర్వాత ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తుండడంతో వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు.
- 9లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ గురు: 6:35
సహర్ శుక్ర: 4:45

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 40.4 /23.2
ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

తాగునీటి సరఫరాపై పర్యవేక్షణాధికారిగా శరత్



సాక్షి, కామారెడ్డి: వేసవి సీజన్‌లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఉమ్మడి జిల్లాకో సీనియర్ ఐఏఎస్‌ను ప్రత్యేకాధికారిగా నియమించింది. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల ప్రత్యేకాధికారిగా గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.శరత్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారులను ఆదేశించారు.

‘నిరంతర శ్రమతోనే లక్ష్యాన్ని చేరుకోగలం’



కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ ఉద్యోగం సాధించడం అంత సులువు కాదని, నిరంతర శ్రమతోనే లక్ష్యాన్ని సాధించగలమని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కళాశాలలో బుధవారం కాంపిటేటివ్ కోచింగ్ సెల్, కెరీర్ గైడెన్స్ సెల్‌ల ఆధ్వర్యంలో పోటీ పరీక్షల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిరోజు సాయంత్రం శిక్షణ కార్యక్రమం ఉంటుందని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంపిటేటివ్ సెల్ సమన్వయకర్త చంద్రకాంత్, వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, అధ్యాపకులు రాజేందర్, గ్రంథపాలకుడు లక్ష్మణాచారి, కెరీర్ గైడెన్స్ సెల్ ప్రతినిధి అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఇళ్ల కొలతలు



కామారెడ్డి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్ల కొలతలను పక్కాగా లెక్కించేందుకు అధికారులు సర్వే ప్రారంభించారు. బుధవారం కామారెడ్డి పట్టణంలోని పలు వార్డులలో గృహాల కొలతలు తీసి, వివరాలను నమోదు చేసుకున్నారు. అనుమతులు ఒక విధంగా నిర్మాణాలు మరోలా ఉండడంతో బల్దియాలకు పూర్తి స్థాయిలో ఆదాయం సమకూరడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో సర్వే చేసి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచడానికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే కామారెడ్డి బల్దియాలో ఇళ్ల కొలతలు నమోదు చేస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారులు, సిబ్బంది, స్థానిక కౌన్సిలర్లు పాల్గొన్నారు.

144 మంది ఉద్యోగులు, టీచర్లకు నోటీసులు

- ఎన్నికల శిక్షణకు గైర్హాజరైనందుకు చర్యలు

సుభాష్‌నగర్/నిజామాబాద్‌అర్బన్: ఎన్నికల కోసం నిర్వహించిన శిక్షణకు గైర్హాజరైన 144 మంది వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. పార్లమెంట్ ఎన్నికలను జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీగా నిర్వహించాలని భావిస్తున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో మంగళవారం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఏర్పాటుచేశారు. ఎన్నికల కోసం విద్యాశాఖ, ఇంటర్మీడియెట్ విద్య, అటవీ, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, మైనార్టీ, ఎస్సీ వెల్ఫేర్, ఐటీఐ, ఇతర శాఖల అధికారులను నియమించారు. శిక్షణకు విద్యా శాఖలో 84 మంది ఉపాధ్యాయులు, మిగతా శాఖలకు చెందిన 40 మంది గైర్హాజరయ్యారు. ఈవిషయాన్ని కలెక్టర్ సీరియస్‌గా పరిగణించారు. గైర్హాజరైన వారికి నోటీసులు జారీ చేయాలని ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు.

దీంతో డీఈవో దుర్గాప్రసాద్ 84 మంది టీచర్లకు, డీఐఈవో రవికుమార్ ఏడుగురు లెక్చరర్లకు, మిగతా శాఖ ల ఉద్యోగులకు ఆ శాఖల ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గురువా రం లోగా సమాధానమివ్వాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని నోటీసుల్లో పేర్కొన్నారు.

లెక్క చూపాల్సిందే

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో చెక్‌పోస్టుల ఏర్పాటు
- తనిఖీ బృందాలను ఏర్పాటు చేసిన అధికారులు
- రూ.50 వేలకుపైగా తరలిస్తే ఆధారాలు అవసరం
- నిబంధనలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులు

మీరు రూ. 50 వేలకన్నా ఎక్కువ మొత్తాన్ని వెంట తీసుకెళ్తున్నారా? అయితే వాటికి సంబంధించిన పూర్తి ఆధారాలు లేకపోతే చిక్కుల్లో పడతారు. ఆధారాలు చూపకపోతే ఎన్నికల అధికారులు ఆ డబ్బును సీజ్ చేసే అవకాశాలుంటాయి. వెండి, బంగారు ఆభరణాలు పెద్దమొత్తంలో ఉన్నా స్వాధీనం చేసుకుంటారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున నగదు తరలించేవారు దానికి సంబంధించిన రసీదుల (బ్యాంకు నుంచి తీసుకున్నవి, చెల్లింపులకు సంబంధించిన పత్రాలు)ను వెంట ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

– సాక్షి, కామారెడ్డి



ఎల్లారెడ్డి పట్టణ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా భారీ మొత్తంలో నగదు తరలించకుండా అడ్డుకునేందుకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేయిస్తోంది. రూ.50 వేలకన్నా ఎక్కువ డబ్బులను తరలిస్తే దానికి సంబంధించిన ఆధారాలు చూపాల్సి ఉంటుంది. లేదంటే అధికారులు ఆ డబ్బును సీజ్ చేస్తారు. ఇది ప్రతి ఎన్నికల సమయంలో రొటీన్‌గా జరిగే వ్యవహారం. ఎందుకంటే ఎన్నికల్లో అభ్యర్థులు, ఆయా రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేయకుండా విధించిన నిబంధన. జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి లెక్కలేని డబ్బులను, సరైన పత్రాలు లేని వస్తు సామగ్రిని సీజ్ చేస్తుంటారు. జిల్లాలో ప్రధాన రహదారులపై తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఏమైనా డబ్బులు కనబడితే సీజ్ చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తనిఖీ చేస్తున్నపుడు వీడియో రికార్డు చేస్తారు. అంతర్రాష్ట్ర సరిహద్దుతో పాటు జిల్లాలోకి ప్రవేశించి వివిధ మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అలాగే ప్రత్యేక బృందాలు కూడా పనిచేస్తున్నాయి. ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలెన్స్ టీం, స్టాటిక్ సర్వైలెన్ టీంలు జిల్లా అంతటా విధులు నిర్వహిస్తున్నాయి. ఏదైనా సమాచారం వస్తే వెంటనే వెళ్లి కేసులు నమోదు చేస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో రూ.2.43 కోట్లు సీజ్...

గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లా అధికారులు 136 కేసులు నమోదు చేశారు. ఇందులో పెద్ద అమౌంట్(రూ.56.84 లక్షలు) ఉన్న కేసును ఇన్‌కం ట్యాక్స్ డిపార్టుమెంటుకు పంపించి, మిగతా కేసులను జిల్లా ఎన్నికల అధికారులు పర్యవేక్షించారు. 135 కేసుల్లో రూ. 1. 86 కోట్లు సీజ్ చేశారు. సీజ్ అయిన డబ్బులకు సంబంధించి తర్వాత ఆధారాలు సమర్పించడంతో వారందరికీ తిరిగి చెల్లించారు. అయితే చాలామంది డబ్బులు సీజ్ అయి, తిరిగి రిటర్న్ తీసుకునేదాకా అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి, ఎందుకోసం తీసుకువెళ్లారు అన్నదానికి ఆధారాలు చూపిన తర్వాత రిలీజ్ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ. 50 వేలకు మించి డబ్బులు తీసుకువెళ్లేవారు కచ్చితంగా ఆధారాలను వెంట ఉంచుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ సూచిస్తున్నారు.

పెళ్లిళ్ల సీజన్‌లో పరేషాన్

శుభ ముహూర్తాలు ఉండడంతో అంతటా పెళ్లిళ్లు జరుగుతున్నాయి. పెళ్లి కోసం అవసరమైన బంగారం, దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలు చేయడం, ఫంక్షన్ హాళ్లు, డొకొరేషన్, క్యాటరింగ్.. ఇలా అన్నింటికీ పెద్దమొత్తంలో డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. ఎలక్షన్ కోడ్ అమలులో ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బ్యాంకు నుంచి డ్రా చేస్తే బ్యాంకుకు సంబంధించిన రసీదులు చూపాలి. రూ.10 లక్షలలోపు నగదు వెంట ఉండి అన్నీ సక్రమంగా ఉంటే అధికారులు వదిలేస్తారు. రూ.10 లక్షలు ఆ పైన ఉంటే ఇన్‌కంట్యాక్స్ అధికారులకు అప్పగిస్తారు. శుభకార్యాల కోసం బ్యాంకుల నుంచి ఎప్పుడో డ్రా చేసి పెట్టుకున్న వారు, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు తీసుకున్నవారు ఆ డబ్బును తీసుకుని వెళ్లే క్రమంలో ఇబ్బంది పడుతున్నారు.

బల్దియా చైర్‌పర్సన్ ఎన్నికపై సస్పెన్స్!



- అడ్డంకిగా మారిన కోర్టు కేసు
- అధికారులపై పెరిగిన ఒత్తిడి
- రేపోమాపో నిర్ణయం తీసుకునే అవకాశం

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి బల్దియా చైర్‌పర్సన్ ఎన్నికపై సస్పెన్స్ కొనసాగుతోంది. గతనెల 30న మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో కొత్తగా చైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. అయితే నాలుగు రోజులు గడుస్తున్నా ఇంకా అధికారులు ఎన్నిక గురించి నిర్ణయం తీసుకోలేకపోతున్నారు.

అవిశ్వాసంపై బలనిరూపణకు ముందుగా చైర్‌పర్సన్ హైకోర్టులో కేసు దాఖలు చేశారు. అవిశ్వాసం నోటీసులో కౌన్సిలర్లకు సంబంధించిన వార్డు నంబర్లను నమోదు చేయకపోవడం, అలాగే తెలంగాణ మున్సిపల్ యాక్ట్ అమల్లోకి వచ్చిన తర్వాత ఏపీ మున్సిపల్ యాక్ట్‌ను ప్రస్తావించిన విషయంలో కోర్టుకు వెళ్లారు. దీనిపై వాదనలు జరిగాయి. కోర్టు కేసును ఈనెల 12కు వాయిదా వేసింది. కోర్టులో కేసు ఉండడంతో చైర్‌పర్సన్ ఎన్నికపై బల్దియా అధికారులు ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నట్లు తెలిసింది. అయితే ప్రభుత్వ పెద్దల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో ఏదో ఒక నిర్ణయం తీసుకునేందుకు అధికారులు సమాయత్తమవుతున్నట్లు సమాచారం. దీనిపై ఒకటి రెండు రోజుల్లో క్లారిటీ వస్తుందని భావిస్తున్నారు.

‘ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తి’



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. అనంతరం ఎల్లారెడ్డి, కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలకు కేటాయించిన ఓటింగ్ యంత్రాల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రభాకర్ రెడ్డి, నరేందర్, ఖాసీం అలీ, మదన్‌లాల్, శ్రీకాంత్, ఎన్నికల విభాగం అధికారులు అనిల్ కుమార్, ఇందిరా ప్రియదర్శిని, ఉమాలత, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘గల్ఫ్ బోర్డు ఏర్పాటుపై సర్కారు సానుకూలం’



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన టీపీసీసీ ఎన్నారై సెల్ నాయకులు, గల్ఫ్ వలస కార్మిక సంఘాల ప్రతినిధులు

మోర్తాడ్(బాల్కొండ): పార్లమెంట్ ఎన్నికల కోడ్ తొలగిన తర్వాత ప్రవాసీ విధానం (ఎన్‌ఆర్‌ఐ పాలసీ)తో కూడిన గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని టీపీసీసీ ఎన్నారై సెల్ ప్రతినిధులు, గల్ఫ్ వలస కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. టీపీసీసీ ఎన్నారై సెల్ ప్రతినిధుల బృందం సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం ఆయన నివాసంలో కలిశారు. ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లోనే గల్ఫ్ మృతుల కుటుంబాలకు సాయం ప్రకటించడంపై కృతజ్ఞతలు తెలుపుతూ గల్ఫ్ వలస కార్మికుల సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశానికి సీఎంను ఆహ్వానించారు. బాల్కొండ మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ ఈరవత్రి అనిల్ ఆధ్వర్యంలో టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్, మాజీ రాయబారి డాక్టర్ వినోద్ కుమార్, ఖతర్ ఎన్నారై దాసరిపల్లి మిథిల, ఎన్నారై సెల్ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవి గౌడ్, ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షులు స్వదేశ్ పరికిపండ్ల, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకులు మంద భీంరెడ్డిలు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. గల్ఫ్ అంశంపై చర్చించడానికి సీఎం సానుకూలంగా స్పందించారని వారు వెల్లడించారు. కార్మికులు గల్ఫ్ దేశాల్లో ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలపై సమగ్రంగా వివరాలను తెలుసుకోవడానికి ప్రతినిధుల బృందం పర్యటిస్తుందని తెలిపారు.

నేడు అవిశ్వాసంపై ఓటింగ్

భిక్కనూరు: బస్వాపూర్ సింగిల్ విండో చైర్మన్ లింగాల కిష్టాగౌడ్‌పై విండో డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసంపై గురువారం ఓటింగ్ నిర్వహించనున్నారు. ఇందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సింగిల్ విండోలో చైర్మన్‌తో కలిపి 13 మంది డైరెక్టర్లు ఉన్నారు. పలువురు డైరెక్టర్లు గతనెల 12వ తేదీన చైర్మన్ కిష్టాగౌడ్‌పై డీసీవోకు అవిశ్వాసం నోటీస్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో డీసీవో గురువారం అవిశ్వాసంపై సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. కాగా 9 మంది మద్దతు ఇస్తే చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గుతుంది. 9 మంది కంటే ఒక్కరు తక్కువైనా అవిశ్వాసం వీగిపోతుంది. అయితే చైర్మన్‌ను తొలగించాలని కృతనిశ్చయంతో ఉన్న 10 మంది డైరెక్టర్లు క్యాంప్‌నకు వెళ్లారు. వీరు సరిగ్గా అవిశ్వాస సమావేశం సమయానికి వచ్చేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నారు. బీఆర్‌ఎస్‌కు చెందిన కిష్టాగౌడ్ బస్వాపూర్ సింగిల్‌విండో చైర్మన్‌గా, డీసీసీబీ డైరెక్టర్‌గా ఉన్నారు. ఇటీవల డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి ఎన్నికకు కిష్టాగౌడ్ సహకరించినందుకే ఆయనను సింగిల్ విండో చైర్మన్ పదవి నుంచి దించివేయాలని కొందరు డైరెక్టర్లు ప్రయత్నిస్తున్నారు. కాగా పదవిని కాపాడుకునేందుకు చైర్మన్ వర్గం సైతం ప్రయత్నాలు చేస్తోంది. క్యాంప్‌లో ఉన్న ఇద్దరు డైరెక్టర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

అవిశ్వాస సమావేశానికి ఏర్పాట్లు

బస్వాపూర్ సింగిల్‌విండో చైర్మన్ కిష్టాగౌడ్‌పై అవిశ్వాస తీర్మానంపై గురువారం నిర్వహించే సమావేశానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విండో సీఈవో మహేశ్వరి బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి డీసీవో శ్రీనివాస్‌రావు, సూపరింటెండెంట్ భూమయ్య హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు.



బస్వాపూర్‌లోని సింగిల్ విండో కార్యాలయం

నాగిరెడ్డిపేట వైస్ ఎంపీపీపై..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట వైస్ ఎంపీపీపై గురువారం అవిశ్వాస పరీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పర్బన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైస్ ఎంపీపీపై ఎంపీటీసీలు ఆర్డీవో ప్రభాకర్‌కు అవిశ్వాస నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ఆర్డీవో సమక్షంలో అవిశ్వాస పరీక్ష నిర్వహించనున్నారు. గతంలో అవిశ్వాస పరీక్ష నిర్వహించరాదని వైస్ ఎంపీపీ రాజ్‌దాస్ హైకోర్టు నుంచి స్టే తీసుకురావడంతో బలపరీక్షను రద్దు చేశారని, ప్రస్తుతం హైకోర్టు స్టే ఆర్డర్‌ను రద్దు చేసినందున అవిశ్వాస పరీక్ష నిర్వహిస్తున్నామని ఎంపీడీవో తెలిపారు.

బడులపై సర్కారు ఫోకస్!

- మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్న సర్కారు
- వేసవి సెలవుల్లో అవసరమైన పనులు చేపట్టాలని ఆదేశాలు
- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో సాగనున్న పనులు



సాక్షి, కామారెడ్డి: ప్రభుత్వ పాఠశాలలపై సర్కారు దృష్టి సారించింది. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులతో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. వారి ఆధ్వర్యంలో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతోంది. ఏ పాఠశాలలో ఏయే అవసరాలు కల్పించాలన్న విషయమై నివేదికలు రూపొందించిన అధికారులు.. అందుకు అనుగుణంగా పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. వేసవి సెలవుల్లో ఆయా పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో సాగుతున్నారు.

స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌నుంచి..

పాఠశాలల్లో తరగతి గదుల్లో విద్యుత్ సౌకర్యం కల్పించి ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు అమర్చనున్నారు. అవసరమైనచోట తాగు నీటి సరఫరాకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. కలెక్టర్ అధీనంలో ఉండే స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులతో పాటు ఉపాధి హామీ నిధులను వాడుకుని స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా స్కూళ్లలో చేపట్టే పనులకు సంబంధించి రూ.లక్షలోపు పనులకు ఎంపీడీవోలు, రూ.లక్ష దాటితే కలెక్టర్ల ద్వారా బిల్లులు చెల్లించనున్నట్లు తెలిసింది. జిల్లాలో 1013 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేశారు. ఆ కమిటీల ఆధ్వర్యంలోనే పనులు చేపట్టనున్నారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, మున్సిపల్, టీఎస్‌ఈడబ్ల్యూడీసీ, తాగునీటికి సంబంధించి మిషన్ భగీరథ అధికారులు ఆయా పాఠశాలలకు సంబంధించిన పనులను పర్యవేక్షించాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలోనే పనులు చేపట్టనున్నారు.

వేసవి సెలవులు పూర్తయ్యేలోగా..

వేసవి సెలవులు ప్రకటించగానే పనులు మొదలు పెట్టి, తిరిగి స్కూళ్లు తెరిచేలోగా పూర్తి చేయాలని అధికారులకు సర్కారు ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి పనులపై దిశానిర్దేశం చేశారు. మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. దాదాపు యాభై రోజుల పాటు స్కూళ్లకు సెలవులు ఉండనున్నాయి. ఆ సమయంలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు చేపడితే తిరిగి స్కూళ్లు తెరిచేలోగా పూర్తి చేయవచ్చని భావిస్తున్నారు.

సానిటేషన్ సిబ్బంది లేకపోవడమే సమస్య

గతంలో పాఠశాలల్లో సానిటేషన్ సిబ్బందిని నియమించుకుని వారి ద్వారా మూత్రశాలలు, మరుగుదొడ్లు శుభ్రం చేయించేవారు. అయితే గత ప్రభుత్వం సానిటేషన్ సిబ్బందిని తొలగించి పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఆయా బాధ్యతలను అప్పగించింది. గ్రామాలలో పారిశుధ్య సిబ్బంది తక్కువగా ఉండడంతో చాలా చోట్ల పంచాయతీలు పట్టించుకోవడంలేదు. పట్టణాల్లోనూ స్కూళ్లలో పారిశుధ్య నిర్వహణ తమది కాదన్నట్టే బల్దియాలు వ్యవహరిస్తున్నాయి. దీంతో సర్కారు బడుల్లోని మూత్రశాలలు, మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడంతో పాటు పారిశుధ్య సిబ్బందిని నియమించాలని విద్యాభిమానులు కోరుతున్నారు.

‘సర్కారు బడిని కాపాడుకుందాం’

బాన్సువాడ: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. బుధవారం బాన్సువాడలోని ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీ కళాశాలలో బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల ప్రభుత్వ పాఠశాలల అమ్మ ఆదర్శ కమిటీలకు ఒక్క రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటు, విధి విధానాలు, నిర్వర్తించాల్సిన బాధ్యతలు, నిధుల వినియోగం లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల కమిటీ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఒక పార్టీకి ప్రచారం చేస్తున్నారని ఏఈ బదిలీ

నిజామాబాద్‌నాగారం: విద్యుత్‌శాఖలోని వేల్పూర్ మండల ఏఈ యశ్వంత్‌రావు ఒక రాజకీయ పార్టీకి ప్రచారం చేస్తున్నారనే ఎన్నికల కమిషన్(ఈసీ) సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో బదిలీ వేటు పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 2న బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి వేల్పూర్‌లో పర్యటన ఉన్నందున ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా గ్రూప్‌లో వచ్చిన సమాచారాన్ని అధికారి తన గ్రూప్‌లో కరెంట్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలని మేసేజ్‌పెట్టారు. పైఅధికారి సమాచారాన్ని తూ.చ తప్పకుండా సదరు ఏఈ తన మండలంలోని విద్యుత్ ఉద్యోగుల గ్రూప్‌లకు ఫార్వర్డ్ చేశారు. ఏఈ పంపించిన సమాచారం కాస్త కాంగ్రెస్ నాయకులకు చేరింది. దీనిపై సీ విజిల్‌లో యాప్‌లో ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేపట్టారు.

ఈసీ సీరియస్..

ఈసీకి ఫిర్యాదు వెళ్లడంతో వెంటనే ఏం జరిగిందో విచారణ చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చాయి. విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రవీందర్, ఇతర అధికారులు విచారణ నివేదికను కలెక్టర్‌కు ఈ నెల 2న సాయంత్రం అందజేశారు. ప్రాథమిక సమాచారం ఆధారంగా వేల్పూర్ ఏఈ యశ్వంత్‌రావును ఖానాపూర్‌కు బదిలీ చేశారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయనున్నట్లు ఎస్‌ఈ తెలిపారు. వేల్పూర్ ఏఈగా ఆర్మూర్ డివిజన్‌లో టెక్నికల్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న సిద్ధి రాములుకు ఇన్‌చార్జీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

క్లుప్తంగా

ఎంపీ అర్వింద్‌కు ఓటు అడిగే హక్కు లేదు



భీమ్‌గల్: పసుపు బోర్డు తీసుకొస్తానని గత ఎన్నికల్లో చెప్పి రైతులను మోసం చేసిన ఎంపీ అర్వింద్‌కు ఓటు అడిగే నైతిక హక్కు లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డిని పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ మెజార్టీతో గెలిపించేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి, పట్టణ అధ్యక్షు డు జేజే నర్సయ్య,నియోజకవర్గ యూత్ ఇన్‌చార్జి నాగేంద్ర,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



మాక్లూర్: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులకు విక్రయించి మోసపోవద్దని జాయింట్ కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కల్లెడిలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 466 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డీసీవో శ్రీనివాస్, మాక్లూర్ విండో చైర్మన్ బూరోల్ల అశోక్, డీసీఏ పాపయ్య, ఆర్మూర్ క్లస్టర్ సత్యనారాయణ, మానిటర్ అధికారి రవీందర్‌సింగ్, కార్యదర్శి సంతోష్, డైరెక్టర్ గంగారాం, మచ్చర్ల రమేశ్, రైతులు ఉన్నారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేద్దాం

- కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి



ఆర్మూర్: నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పార్టీ శ్రేణులంతా ఏకమై పని చేయాలని ఆ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి నివాసంలో పార్టీ ముఖ్య నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని పరిస్థితులను, ఎన్నికల సమయంలో ఆచరించే వ్యూహాలను వారితో చర్చించారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల మనోహర్‌రెడ్డితో కలిసి పలు శుభకార్యాలలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు సాయిబాబా గౌడ్, మారుతిరెడ్డి, అయ్యప్ప శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ



రాజంపేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బస్వన్నపల్లి శివారులో అధికారులు, పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలు నడిపే వ్యక్తులు సరైన ధ్రువపత్రాల తమ వెంట ఉంచుకోవాలని, ఒకవేళ రూ.50వేలకు మించి నగదు ఉంటే దానికి సంబంధించిన ధ్రువపత్రాలు ఉంచుకోవాలని సూచించారు.

తెయూ చరిత్రలో మరో మచ్చ..

- నిషేధిత డ్రగ్స్ తయారీలో తెయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ అరెస్ట్
- చర్యలు తీసుకోవడంలో వర్సిటీ ఉన్నతాధికారుల మీనమేషాలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ చరిత్రలో మరో మచ్చ చోటు చేసుకుంది. గతంలో తెయూ వీసీగా పనిచేసిన ప్రొఫెసర్ రవీందర్‌గుప్తా లంచం తీసుకుంటూ అవినీతి కేసులో పోలీసులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడి జైలుకు వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో తెలంగాణ యూనివర్సిటీ పేరు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. దేశంలోనే పదవిలో ఉన్న యూనివర్సిటీ వీసీ ఒకరు అవినీతి కేసులో అరెస్ట్ అయి జైలుకెళ్లడం అదే మొదటిసారి. ప్రస్తుతం తెయూ ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీనివాస్ నిషేధిత డ్రగ్స్ (మాదకద్రవ్యాల) తయారీ కేసులో పోలీసుల చేతిలో అరెస్ట్ అయి జైలుకు వెళ్లడం వర్సిటీ చరిత్రలో మరో మచ్చగా మారింది.

అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీనివాస్ 2014లో తెయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2018లో వర్సిటీ అనుబంధంగా ఉన్న భిక్కనూర్ సౌత్ క్యాంపస్‌కు బదిలీ అయ్యారు. వర్సిటీ ఉద్యోగులకు లీన్ (డిప్యుటేషన్) పీరియడ్ కింద వర్సిటీ అనుమతితో ఐదేళ్లకు ఒక సంవత్సరం ఇతర సంస్థల్లోకి వెళ్లి పని చేసే అవకాశం కల్పిస్తారు. అయితే ఉద్యోగంలో చేరిన నాలుగేళ్లకే నాటి వీసీని ప్రసన్నం చేసుకుని శ్రీనివాస్ లీన్‌పై వెళ్లారు. ఇలా ఏకంగా నిబంధనలకు విరుద్ధంగా ఆరేళ్ల పాటు శ్రీనివాస్ లీన్‌పై వెళ్లారు. ప్రతి రెండేళ్లకోసారి వీసీలను మచ్చిక చేసుకుని లీన్ పొడిగింప జేసుకున్నారు. ఈ విషయాన్ని 2021లో గుర్తించిన వర్సిటీ పాలకమండలి సభ్యులు 53వ ఈసీ సమావేశంలో డిప్యుటేషన్‌పై ఉన్న వర్సిటీ ఉద్యోగులు వెంటనే లీన్ రద్దు చేసుకుని వర్సిటీలో తిరిగి చేరాలని 2021లో తీర్మానం చేశారు. అయితే ఏ ఒక్కరూ పాలక మండలి ఆదేశాలను పాటించలేదు. వర్సిటీ ఉన్నతాధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. దీంతో లీన్‌పై వెళ్లిన వారు అలాగే ఉండిపోయారు.



తెయూ పరిపాలనా భవనం

వర్సిటీ ఉన్నతాధికారులు నోటీసులపై నోటీసులు ఇవ్వడంతో ఎట్టకేలకు శ్రీనివాస్ నాలుగు నెలల క్రితం యూనివర్సిటీకి వచ్చారు. తాను తిరిగి విధుల్లో చేరతానని చెప్పగా తొలుత రిజిస్ట్రార్ యాదగిరి అంగీకరించలేదు. దీంతో శ్రీనివాస్ రిజిస్ట్రార్‌తో తీవ్రంగా గొడవ పడ్డాడు. చివరకు రిజిస్ట్రార్ అతడిని మళ్లీ విధుల్లోకి తీసుకున్నారు. సౌత్ క్యాంపస్‌లో తిరిగి విధుల్లో చేరిన శ్రీనివాస్ బయోమెట్రిక్ హాజరును పట్టించుకోకుండా కేవలం రిజిస్టర్‌లో సంతకాలు మాత్రమే చేసి వేతనం తీసుకుంటున్నారు. బయోమెట్రిక్ విషయమై వర్సిటీ ఉన్నతాధికారులు ఎన్నిసార్లు చెప్పినా ఏమాత్రం ఖాతరు చేయకుండా నిర్లక్ష్యంగా ఉండేవారని ఇతర అధ్యాపకులు చెప్పడం గమనార్హం.

ఈ క్రమంలో ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ చట్ట వ్యతిరేకంగా నిషేధిత డ్రగ్స్ తయారు చేస్తూ గత నెల 22న శ్రీనివాస్ అరెస్ట్ అయిన విషయం మూడు రోజుల క్రితం వర్సిటీ రిజిస్ట్రార్ దృష్టికి రావడంతో శ్రీనివాస్ మార్చి నెల వేతనాన్ని నిలిపి వేశారు.

అయితే ప్రభుత్వ ఉద్యోగి ఏదైనా కేసులో అరెస్ట్ అయిన 48 గంటల్లో విధుల్లో నుంచి సస్పెండ్ చేయాల్సి ఉంటుంది. ఈ విషయమై రిజిస్ట్రార్ యాదగిరిని సంప్రదించగా ఇంకా తనకు పోలీసుల ఎఫ్ఐఆర్ కాపీ అందలేదని న్యాయసలహా మేరకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ శివారులో మెడికెమ్ ల్యాబ్ అనే సంస్థలో శ్రీనివాస్ మేనేజింగ్ పార్ట్‌నర్‌గా కొనసాగుతున్నారు. ఈ ల్యాబ్‌లో ఖరీదైన ఫార్మా డ్రగ్స్‌ను తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రపంచ వ్యాప్తంగా కొన్ని ఫార్మా కంపెనీలు సిండికేట్‌గా మారి ఇలా నిషేధిత డ్రగ్స్‌ను తయారు చేసి ఇతరదేశాలకు ఎగుమతులు, దిగుమతులు చేస్తుంటారు. కొన్ని కంపెనీలు అప్పుడప్పుడు పట్టుబడినప్పటికీ ఇందులో వచ్చే ఆదాయం వల్ల చాలా కంపెనీలు వీటిని ఇల్లీగల్‌గా కొనసాగిస్తుంటాయి. అయితే ఇలా హైదరాబాద్‌లో నిషేధిత డ్రగ్స్ తయారీ చేస్తూ పట్టుబడటం, అరెస్ట్ అయిన వారిలో తెయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉండటం సంచలనంగా మారింది. నిషేధిత డ్రగ్స్ తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేయడాన్ని ముందుగా ఇంటర్‌పోల్ అధికారులు గుర్తించినట్లు సమాచారం. శ్రీనివాస్‌ను ఏకంగా ఇంటర్‌పోల్ పోలీసుల సాయంతో హైదరాబాద్ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ), రాష్ట్ర ఎక్సైజ్ పోలీస్ అధికారులు గత నెల 22న అరెస్ట్ చేశారు. వర్సిటీ అధ్యాపకులు ప్రభుత్వం అనుమతించిన ఫార్మా ఉత్పత్తులపై పరిశోధనలు చేయాల్సి ఉండగా ఇలా నిషేధిత డ్రగ్స్‌ను ఉత్పత్తి చేస్తూ పట్టుబడటం సిగ్గు చేటని వర్సిటీ వర్గాలు విమర్శిస్తున్నాయి.

జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకాలు



క్రీడాకారిణులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

డిచ్‌పల్లి: మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో నిర్వహించిన జాతీయ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున పాల్గొన్న డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గురుకుల పాఠశాల విద్యార్థినులు బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ గోదావరి తెలిపారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారిణులు గంగోత్రి, నిషిత, లిఖితను ప్రిన్సిపాల్ గోదావరి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్, వైస్ ప్రిన్సిపాల్ దీప్తివాణి, వైస్‌ప్రిన్సిపాల్ వనిత, వ్యాయామ ఉపాధ్యాయురాలు నల్లూరి లత, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ వేముల మౌనిక, ఉపాధ్యాయులు అభినందించారు.

యువతిపై లైంగికదాడి..

- హనుమకొండలో జీరో ఎఫ్ఐఆర్ నమోదు

వరంగల్ క్రైం: యువతిపై ఓ యువకుడి లైంగికదాడికి పాల్పడ్డాడు. దీనిపై హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం జీరో ఎఫ్ఐఆర్ నమోదైంది. సుబేదారి ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాలు ఇలా. కరీంనగర్‌కు చెందిన ఓ యువతి హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రభుత్వ సంస్థలో నర్సింగ్ శిక్షణ పొందుతుంది. ఆ యువతికి కామారెడ్డికి చెందిన ఓ యువకుడితో ఆన్‌లైన్‌లో పరిచయం ఏర్పడింది. దీంతో ఆ యువకుడు.. యువతిని కామారెడ్డికి పిలిపించుకుని లైంగికదాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి జీరో ఎఫ్ఐఆర్‌ను కామారెడ్డికి బదిలీ చేసినట్లు సుబేదారి పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని నల్లవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్ బుధవారం తెలిపారు. నర్సింగ్‌రావుపల్లికి చెందిన సాయిలు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని సాయిలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అపరిచితులు కనిపిస్తే సమాచారం అందించాలి

ఖలీల్‌వాడి: జిల్లాలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే స్థానికులు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సీపీ కల్మేశ్వర్ బుధవారం పేర్కొన్నారు. ఇటీవల జరిగిన కొన్ని ఘటనల్లో కొంత మంది చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని దాడి చేయడం సరైంది కాదన్నారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే దాడి చేయకుండా 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

కామారెడ్డి టౌన్: ఓ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారానికి యత్నించిన నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షను కామారెడ్డి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ పోక్సో యాక్ట్ కోర్టు న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్ బుధవారం విధించారు.రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన పూసల కనకయ్య 2022లో ఓ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారానికి యత్నించాడు. ఈ మేరకు నిందితుడిపై పోక్సో కేసును పోలీసులు నమోదు చేశారు. బాధితుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కావేటి శేషు వాదనలు వినిపించగా, ఎస్సై నరేశ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎస్. విజయ్‌కుమార్ కేసు విచారణ చేపట్టారు. నిందితుడికి శిక్ష పడేలా చేసిన పోలీసులను ఎస్పీ సింధూ శర్మ అభినందించారు.

వివాహిత అదృశ్యం

నస్రుల్లాబాద్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై లావణ్య బుధవారం తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన సదరు మహిళ ఇంటికి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గండివేట్‌లో మద్యం స్వాధీనం

గాంధారి: మండలంలోని గండివేట్‌లో అక్రమంగా దాచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన బండారి రామకృష్ణ తన ఇంట్లో అక్రమంగా మద్యం దాచినట్లు సమాచారం అందడంతో దాడి చేసి మద్యాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. మద్యం విలువ రూ. 30 వేల వరకు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

బోధన్ టౌన్: జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ వీరయ్య బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని రెంజల్ బేస్ హీరా కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ వహీద్ అలియాస్ షేక్ ఖురేషి(25) సెంట్రింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన అతను జీవితంపై విరక్తి చెంది ఈ నెల 1న కాలనీ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ తరలించగా, మృతుడి అక్క మెహర్ ఉన్నీసా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

మతిస్థిమితం కోల్పోయి..

మాక్లూర్: మతిస్థిమితం కోల్పోయి ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ముల్లంగి (బి)లో చోటు చేసుకుంది. ఏఎస్సై గంగాధర్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేకల పోసాని(60)కి కొన్ని రోజుల క్రితం మతిస్థిమితం కోల్పోయింది. ఇటీవల ఆమె అల్లుడు మృతి చెందడంతో కల్లుకు అలవాటు పడింది. ఈ నెల 2న ఇంటి నుంచి వెళ్లిన పోసాని తిరిగి రాలేదు. గ్రామ సమీపంలోని చెరువుల మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విచారణ చేపట్టిన పోలీసులు పోసాని మృతదేహంగా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

పక్కింటి వారు దూషించారని..

రామారెడ్డి: ఇంటి పక్కన ఉన్నవారు దూషించారని మనస్తాపానికి చెందిన ఓ వివాహిత గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన రామారెడ్డిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కొండ తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డి గ్రామానికి చెందిన బిట్ల లక్ష్మి(35)కి వారి ఇంటి పక్కనే ఉన్న బిట్ల అనసూయతో మురుగు కాలువ విషయమై గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి చెందిన లక్ష్మి ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. వ్యవసాయ పనులు నుంచి ఇంటికి వచ్చిన భర్త రాజు లక్ష్మి కింద పడిపోవటాన్ని గమనించి ఆస్పత్రికి తరలించాడు. స్థానిక వైద్యుల సూచన మేరకు నిజామాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి భర్త రాజు ఫిర్యాదు మేరకు అనసూయ పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి

రెంజల్: ప్రమాదవశాత్తు చెరువులో పడి పశువుల కాపరి మృతి చెందిన ఘటన మండలంలోని తాడ్‌బిలోలిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయికుమార్(21) అదే గ్రామానికి చెందిన హన్మంత్‌రావు వద్ద పాలేరుగా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం పశువులను మేపడానికి గోదావరి నది ఒడ్డుకు తీసుకెళ్లాడు. నదిలో నీరు తాగేందుకు వెళ్లిన గేదెలను తీసుకొచ్చేందుకు వెళ్లిన సాయికుమార్ ఈత రాక నీటిలోని ఊబిలో చిక్కుకున్నాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గాలించినా ఆచూకి లభించలేదు. ఉదయం మృతదేహం పైకి తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో ఉపాధ్యాయుడు..

తాడ్వాయి: బ్రెయిన్ స్ట్రోక్‌తో ఉపాధ్యాయుడు మృతిచెందిన ఘటన మండలంలోని దేవాయిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పైడి వెంకట్‌రాంరెడ్డి (57) ఫర్మాయికుంట తండాలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల అతనికి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. స్వగ్రామంలో గురువారం అంత్యక్రియలు జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు.

కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం లభ్యం

ఇందల్వాయి: మండలంలోని స్టేషన్ తండా శివారులో ఉన్న అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉందని, మృతదేహాన్ని మార్చురికి తరలించామన్నారు. అతని వద్ద లభించిన సెల్ ఫోన్ ఆధారంగా వివరాలు సేకరించగా జిల్లా కేంద్రంలోని జెండాగల్లీకి చెందిన వ్యక్తిగా గుర్తించి అతని బంధువులకు సమాచారం అందించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మాడ వీధుల్లో శ్రీవారి ఊరేగింపు



స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఉన్న ఇందూరు తిరుమలలో శ్రీవేంకటేశ్వర స్వామి దశమ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీనివాసుడిని అశ్వవాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు. 5వరోజు పూర్ణాహుతి, దోపోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఆళ్వారుల్లో చివరి ఆళ్వారు తిరుమంగై ఆళ్వారు జీవిత చరిత్రను దోపోత్సవంగా ప్రదర్శించారు. సినీనటుడు రవి నృత్యరూపకాల్లో నటించి భక్తులను అలరించారు. అనంతరం దేవనాథ జీయరు స్వామి, గంగోత్రి రామానుజ దాసు స్వామి వారు ప్రవచించారు. అశ్వవాహనంపై వచ్చిన శ్రీవారు సిరిసంపదలను తీసుకొస్తారని తెలిపారు. ఆలయ ధర్మకర్త నరసింహరెడ్డి, ధర్మకర్తలు శిరీష్, విజయసింహా రెడ్డి, సాయిరెడ్డి, ఎంపీటీసీ రాములు, రవీందర్ యాదవ్, నర్సారెడ్డి, ప్రసాద్, రమేశ్, భాస్కర్, నరేందర్, గంగారెడ్డి, యాజ్ఞాచార్యులు సత్యన్నారాయణాచార్యులు, శ్రీకర్ కుమారాచార్యులు, రోహిత్ కుమారాచార్యులు, విజయ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల ఓట్ల కోసమే కాంగ్రెస్ పాకులాట



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

సుభాష్‌నగర్: రాష్ట్రంలో ముసింల ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ పాకులాడుతోందని, అందుకు నిదర్శనమే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సీఏఏ, ఎన్ఆర్‌సీ అమలు చేయమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారికంగా ప్రకటించడాన్ని ఖండిస్తున్నామన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడానికి, ముస్లింల ఓట్ల కోసం ఈ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. పార్లమెంట్‌లో పాసైన చట్టాలను ఏ రాష్ట్రమైనా అమలు చేయమనే అధికారం లేదన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నించే విధంగా మాట్లాడిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, ప్రధానకార్యదర్శి లక్ష్మీనారాయణ, స్రవంతిరెడ్డి, న్యాలం రాజు, శంకర్, మల్లేశ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

గత వేలం ధరకే సంతల నిర్వహణ

నవీపేట: మండల కేంద్రంలో నిర్వహించే మేకల సంతతో పాటు వారాంతపు కూరగాయల సంతల వేలంను గతేడాది ధరకే నిర్వహించాలని కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024 – 25సంవత్సరానికి ఈ రెండు సంతలకు ఇటీవల వేలం నిర్వహించారు. కానీ కనీస ధర రాలేదని మేకలు, కూరగాయల సంతల వేలంను వాయిదా వేశారు. గతేడాది మేకల సంతకు రూ. 55 లక్షల వేలం రాగా.. కూరగాయల సంతకు రూ. 15 లక్షల వేలం వచ్చింది. కానీ ఈ ఏడాది రెండు సంతలకు ఆశించిన వేలం రాలేదు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కలెక్టర్, డీపీవోలు ప్రత్యేక చొరవ తీసుకుని ఉత్తర్వులు జారీ చేశారు. కోడ్ ముగిసే వరకు గతేడాది వచ్చిన వేలం ప్రకారమే వసూలు చేయాలని ఆదేశించారు. ముందుకు వచ్చిన గుత్తేదారులకు నియమ నిబంధనలు వివరించాలని సూచించారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

లింగంపేట: విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదైంది. ఈ ఘటన మండలంలోని శెట్పల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శెట్పల్లి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీనివాస్‌శర్మ విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించేవాడు. గతంలో మహిళా ఉపాధ్యాయినులపై దురుసుగా ప్రవర్తించడంతో వారు గట్టిగా హెచ్చరించారు. దీంతో అతని కన్ను విద్యార్థినులపై పడింది. అదును చూసి వారిపై అసభ్యంగా ప్రవర్తించేవాడు. రెండో రోజుల క్రితం పాఠశాలలో షీటీం బృందం విద్యార్థినులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సమాజంలో మహిళలపై జరుగుతున్న అరాచకాలపై అవగాహన కల్పించారు. దీంతో వారు సదరు ఉపాధ్యాయుడు ప్రవర్తిస్తున్న తీరును షీ టీమ్ సభ్యులకు వివరించారు. అదే రోజు బృందం సభ్యులు ఉపాధ్యాయులు, విద్యార్థినులను విచారించారు. ఉపాధ్యాయుడి ప్రవర్తన సక్రమంగా లేదని, మద్యం సేవించి పాఠశాలకు వచ్చేవాడని, పాఠశాలలో బయటి వ్యక్తులతో వీడియో కాల్ చేసేవాడని తెలిపారు. ఈ విషయాన్ని వారు పోలీసులకు తెలుపడంతో వారు ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేశారు. ఉపాధ్యాయుడిని గురువారం రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మంచిప్ప బీపీఎంపై కేసు నమోదు

మోపాల్: మండలంలోని మంచిప్ప బీపీఎం అశోక్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ బుధవారం తెలిపారు. ఫిబ్రవరి 14న తపాలశాఖ ఇన్‌స్పెక్షన్ ఇన్‌స్పెక్టర్ సుస్మిత బెనర్జీ ఆకస్మికంగా మంచిప్ప తపాలశాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆ సమయంలో బీపీఎం అశోక్ వద్ద ఉండాల్సిన నగదు రూ.75,275 తక్కువగా ఉన్నాయి. వెంటనే ఆమె విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నగదు తక్కువగా ఉండటానికి గల కా రణాలపై విచారణ చేపట్టగా, నగదును సొంతానికి వాడుకున్నానని అశోక్ ఒప్పుకున్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సుస్మిత బెనర్జీ అశోక్‌పై ఫిర్యాదు చేశారు.ఆమె ఫిర్యాదు మేరకు అశోక్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఐదు కేసులు నమోదు..

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత జిల్లాలో రూ.50వేలకు మించి నగదు, బంగారు, వెండి ఆభరణాలు తరలింపునకు సంబంధించి 5 కేసులు నమోదైనట్లు జిల్లా గ్రీవెన్స్ కమిటీ చైర్మన్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాన్సువాడ, బాల్కొండ నియోజకవర్గాల్లో 1 చొప్పున, నిజామాబాద్ అర్బన్‌లో 3 కేసులు నమోదయ్యాయన్నారు. అందులో నాలుగు కేసులకు సంబంధించి రూ.15, 21930లను రిలీజ్ చేయగా, ఒక కేసును ఆదాయ పన్ను శాఖకు సిఫార్సు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున రూ.50వేల నగదు కంటే ఎక్కువ డబ్బులు, బంగారం, వెండి వస్తువులతో ప్రయాణించొద్దని సూచించారు. ఒకవేళ తెలియక ప్రయాణించి నగదు, వస్తువులను జప్తు చేస్తే.. ఆందోళన చెందకుండా సంబంధిత ధ్రువపత్రాలతో జిల్లా గ్రీవెన్స్ కమిటీ నోడల్ అధికారి పల్లె పాపయ్యను సంప్రదించాలని తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 649 కేసులు

ఖలీల్‌వాడి: జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో మార్చి నెలలోనే 649 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు సీపీ కల్మేశ్వర్ బుధవారం పేర్కొన్నారు. గతేడాది మొత్తం 767 రోడ్డు ప్రమాదాల కేసులు నమోదు కాగా ఇందులో 337 మంది మృతి చెందినట్లు వెల్లడించారు. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలోనే 649 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు కాగా ఇందులో 267 మందికి జైలు శిక్ష పడిందన్నారు. ఇందులో కొంత మందికి 10 రోజుల నుంచి 14 రోజుల వరకు జైలు శిక్ష పడినట్లు పేర్కొన్నారు. ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడుపరాదని కోరారు.

నిందితుల అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లేశ్

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్‌లో ఉన్న వేంకటేశ్వర ఆలయంలో హుండీ చోరీ చేసిన దుండగులను పట్టుకుని అరెస్ట్ చేసినట్లు డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి తెలిపారు. జక్రాన్‌పల్లి పీఎస్‌లో చోరీ నిందితుల వివరాలను సీఐ వెల్లడించారు. పడకల్‌లోని శ్రీవెంకటేశ్వర ఆలయంలో ఈ నెల 1న హుండీని పగలగొట్టి అందులోని నగదును దుండుగులు ఎత్తుకెళ్లారన్నారు. ఆలయ కమిటీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ కొనసాగించినట్లు తెలిపారు. కాగా తొర్లికొండ గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించడంతో తనిఖీ చేపట్టామన్నారు. దుండగులను విచారించగా ఆలయంలో చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారని అన్నారు. అనంతరం హుండీ నుంచి ఎత్తుకెళ్లిన రూ. 74,500 నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. సమావేశంలో ఏఎస్సై వెంకట్‌కుమార్, కానిస్టేబుళ్లు జీవన్, భూపతి, భూమేశ్ ఉన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా



ఆటోలో ఇరుక్కున్న వ్యక్తిని బయటకు తీస్తున్న పోలీసులు

రాజంపేట: మండలంలోని బస్వన్నపల్లి శివారులో బుధవారం సాయంత్రం ఓ ఆటో అదుపు తప్పి చెట్టును ఢీకొన్నది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బస్వన్నపల్లికి చెందిన పెడతాల నాగమణి బంధువులు హైదరాబాద్ నుంచి ఆటోలో బస్వన్నపల్లికి వస్తుండగా గ్రామ శివారులో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ సిద్ధి రాములు ఆటోలో చిక్కుకోవడంతో పోలీసులు బయటకు తీసారు. క్షతగ్రాతులను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.